క్లుప్తంగా

గూడూరు సీఐగా రాజు

గూడూరు: గూడూరు సీఐ బి.రాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్ ఎస్సై రాణాప్రతాప్, ప్రవళిక, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

గార్ల–బయ్యారం సీఐగా రవికుమార్

బయ్యారం: గార్ల–బయ్యారం సీఐగా భూక్య రవికుమార్‌ను నియమిస్తూ బుధవారం మల్టీజోన్–2 ఐజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సీఐగా కొనసాగుతున్న కోట బాబురావును బదిలీ చేసి మల్టీజోన్–1 కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మరిపెడ సీఐగా హతీరాంనాయక్

మరిపెడ: మరిపెడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా హతీరాంనాయక్ బాధ్యతలు చేపట్టారు. మల్టిజోన్ 1నుంచి మరిపెడకు బదిలీపై వచ్చారు.

దంతాలపల్లి ఎస్సైగా కరుణాకర్

దంతాలపల్లి: మండల నూతన ఎస్సైగా కరుణాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించాడు.

చిన్నగూడూరు ఎస్సైగా ఝాన్సీ

చిన్నగూడూరు: చిన్నగూడూరు ఎస్సైగా ఝాన్సీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై చిన్నగూడూరుకు నియమితులయ్యారు.

చెక్కు అందజేత



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలో ఇస్లావత్ తండా (ఎస్) గ్రామానికి చెందిన ఇస్లావత్ బిచ్యా ప్రమాదవశాత్తు ద్విచక్రవాహన ప్రమాదంలో మృతిచెందగా భార్య ఇస్లావత్ ఉపేంద్రకు రూ.10లక్షల ప్రమాద బీమాపాలసీ చెక్కును బుధవారం వరంగల్ డివిజన్ తపాలా శాఖ పర్యవేక్షకులు ఎస్‌వీఎల్ఎన్ రావు అందజేశారు. కార్యక్రమంలో తపాలా శాఖ సహాయ పర్యవేక్షకులు ఎల్.సైదానాయక్, బ్రాంచ్ మేనేజర్ డి.సంపత్ కుమార్, ఐపీపీబీ మేనేజర్ సునీత, సుధాకర్, ప్రశాంత్, మౌనిక పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



మహబూబాబాద్ అర్బన్: ఈనెల 24 నుంచి భద్రాచలం నుంచి పాలకుర్తి వరకు జరగనున్న మహబూబాబాద్ పార్లమెంట్ రథయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మానుకోట పార్లమెంట్ ఎన్నికల కార్యాలయాన్ని బుధవారం ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్లమెంటు కన్వీనర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రభారి కన్వీనర్ వెంకట్ నారాయణ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదివాసీ యాప సీతయ్య పటేల్, ములుగు జిల్లా అధ్యక్షుడు బలరాం, రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మండమెలిగె పూజలు



గూడూరు: మండలంలోని దామరవంచ సమీప మహబూబాబాద్ వైపు వెళ్లే జాతీయ రహదారి పక్కన చింతలగట్టు వట్టివాగు శ్రీసమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద బుధవారం జాతర నిర్వహణ కమిటీ, పూజారులు ఘనంగా మండమెలిగె నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ సుచిత్ర, మండల కాంగ్రెస్ నాయకులు పూజల్లో పాల్గొన్నారు. పూజారి దారం సిద్దు బృందం అమ్మవార్ల గద్దెలను శుభ్రం చేసి, చుట్టూ మకర తోరణాలు కట్టించారు. అనంతరం జాతర ప్రదేశ నిర్బంధ పూజలు చేశారు.

జడ్జిని కలిసిన టౌన్ సీఐ



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్‌ను టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

వెలగని వీధి దీపాలు

చిన్నగూడూరు: మండల కేంద్రంలో వీధి దీపాలు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని రావిచెట్టు బజార్ నుంచి పాత అంగడికి వెళ్లే బజార్‌లో వీధి దీపాలు వెలుగక చీకట్లు అలుముకున్నాయి. అధికారులు స్పందించి మండల కేంద్రంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రేణుకాచౌదరి పేరు ప్రకటించడంపై హర్షం

గార్ల/బయ్యారం: తెలంగాణ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎంపీ అభ్యర్థిగా రేణుకాచౌదరి పేరును ఖరారు చేస్తూ బుధవారం ఏఐసీసీ ప్రకటించడంపై టీపీసీసీ సభ్యుడు రావూరి వెంకట్రామయ్య, తాళ్లపల్లి కృష్ణగౌడ్, వడ్లమూడి సురేష్ హర్షం వ్యక్తం చేశారు.

రైతులపై దాడి హేయం



నెహ్రూసెంటర్: మాట్లాడుతున్న పాయం చంద్రన్న



గార్ల: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: దేశ రాజధాని ఢిల్లీలో రైతులపై మోదీ సర్కార్ దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, రైతులపై దాడులు హేయమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీకి చేరిన రైతులపై కేంద్ర సర్కార్ ప్రదర్శిస్తున్న తీరు ఆక్షేపణీయమన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, నాయకులు పూనెం ప్రభాకర్, ముల్కూరు జగ్గన్న, బిల్లకంటి సూర్యం, బండపల్లి వెంకటేశ్వర్లు, ఉమ్మగాని సత్యం, పైండ్ల యాకయ్య పాల్గొన్నారు.

గంగారం: ఢిల్లీలో రైతాంగంపై మోదీ సర్కార్ దాడి దుర్మార్గమని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా గంగారం, కొత్తగూడ మండలాల కార్యదర్శి పూణెం ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శత్రు దేశాల సరిహద్దుల్లో అనుసరించాల్సిన కఠినమైన పద్ధతులు దేశానికి అన్నంపెట్టే రైతన్నలపై ప్రయోగించడం సిగ్గుచేటన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి మద్దతుగా సంఘీభావం పోరాటాలు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఈక భిక్షం, జోగ రాములు, అశోక్, నారాయణ, బుచ్చిరాములు, పాల్గొన్నారు.

నెల్లికుదురు: రైతులపై మోదీ కపట ప్రేమ బయటపెట్టుకున్నాడని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు ఆలకుంట్ల సాయన్న అన్నారు. బుధవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా మండలంలోని రామన్నగూడెం గ్రామంలో రైతులతో కలసి ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు యాకూబ్, హరీశ్, నాగన్న, శ్రీను, యాదయ్య, యాకయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గార్ల: ఢిల్లీలో శాంతియుతంగా రైతాంగం చేస్తున్న ప్రదర్శనపై కేంద్రప్రభుత్వం పోలీసుల బలగాలచే రైతులపై దాడి చేయడాన్ని నిరసిస్తూ గార్లలో అఖిలపక్షం నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కందునూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ, సక్రు, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, కృష్ణారెడ్డి, వీరస్వామి పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



డోర్నకల్: వాహనదారుడికి పూలు అందించి అభినందిస్తున్న సీఐ

డోర్నకల్: వాహనదారులు నిబంధనలు పాటించాలని డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు కోరారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని డోర్నకల్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న వాహనదారులకు పూలు అందించి అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుమేర్‌చంద్‌జైన్, శీలం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ: వాహనాదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్సై తహెర్‌బాబా అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా మరిపెడలో బైక్‌ర్యాలీ నిర్వహించారు.

కురవి: కురవి ఎస్సై బి.గోపి ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకు పూలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

కేసముద్రం: వాహనాదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని కేసముద్రం ఎస్సై వంశీధర్ అన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించిన వారికి ఎస్సై చాక్లెట్‌లను పంచిపెట్టారు.

గార్ల: రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలు నడుపుతున్న వాహనదారులకు గార్ల, బయ్యారం ఎస్సైలు ఎస్.జీనత్‌కుమార్, ఉపేందర్ చాక్లెట్లు అందజేశారు.

కొత్తగూడ: రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని మండలకేంద్రంలో పోలీసులు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ద్విచక్రవాహనం నడిపే ప్రతీ వ్యక్తి హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు ధరించడం వల్ల వచ్చే ఉపయోగాలను వివరించారు. అనంతరం వాహనదారులకు స్వీట్లు తినిపించారు.

నెల్లికుదురు: ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని ఎస్సై క్రాంతికిరణ్ వాహనదారులను కోరారు. మండల కేంద్రంలో విద్యార్థులు, వాహనదారులతో ర్యాలీ నిర్వహించారు.

పుల్వామా అమరులకు ఘన నివాళి



తొర్రూరు: నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తొర్రూరు: పుల్వామాలో జరిగిన దాడిలో మరణించిన సైనికులకు వందేమాతరం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్ రవీందర్ రావు మాట్లాడుతూ.. పాక్ ఉగ్రవాదుల దాడిలో భారతదేశానికి చెందిన 40 మంది సైనికులు తమ ప్రాణాలను వదులుకోవడం ఎంతో బాధాకరమని, ఇలాంటి ఘటనలు మరోసారి రాకుండా ప్రభుత్వాలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సిద్ధార్థ స్కూల్ వారి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ ముత్తినేని జయప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని అంబేడ్కర్‌సెంటర్‌లో పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవానుల చిత్రపటాల వద్ద నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్దన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొనకటి మహేందర్, పోతుల రవీందర్, చెడుపల్లి ఏలేందర్, రాకేష్, వేణు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక

డోర్నకల్: డోర్నకల్ మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు రూపొందించిన రెండు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికయ్యాయి. డోర్నకల్ నిర్మలా హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న పాలడుగు నిఖిల్ రూపొందించిన 'టర్నింగ్ కార్బన్ డై ఆక్సైడ్ ఇన్ టూ ఫ్యూయల్' ప్రాజెక్ట్, ముల్కలపల్లి జెడ్పీహెచ్ఎస్ 8వ తరగతి విద్యార్థి జక్కుల గోపిచంద్ రూపొందించిన స్మార్ట్ అంబులెన్స్ ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి.

గ్రామాభివృద్ధికి కృషి

దంతాలపల్లి: గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర కార్యదర్శి, డీసీసీ ప్రధాన కార్యదర్శి కొమ్మినేని సతీష్ అన్నారు. మండలంలోని దాట్ల గ్రామంలో జెండా గద్దె నిర్మాణం కోసం బుధవారం పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుండాల ఐలయ్య, నాయకులు లతీబ్, స్వర్గం సతీష్, చిట్యాల యాకాంబరం పాల్గొన్నారు.

వసంత పంచమి వేడుకలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని గాదె రుక్మారెడ్డి మెమోరియల్ హైస్కూల్‌లో శ్రీ సరస్వతీమాత జన్మదినం సందర్భంగా వసంత పంచమి వేడుకలను ఘనంగా బుధరవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ రీనగోపికృష్ణ, రజితమాధవ్, ప్రిన్సిపాల్ కమ్మగాని కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ



బయ్యారం ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

బయ్యారం: బయ్యారం ఎంపీడీఓగా బి.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి సూర్యాపేట జిల్లాకు బదిలీ అయ్యారు.

దంతాలపల్లి: దంతాలపల్లి ఎంపీడీఓగా ఎస్.వివేక్రం బాధ్యతలు స్వీకరించాజుజీ. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బుర్గంపహాడ్ మండలం నుంచి బదిలీపై వచ్చారు.

కురవి: కురవి ఎంపీడీఓగా కోట వీరబాబు బుధవారం బాధ్యతలను స్వీకరించారు.

డోర్నకల్: డోర్నకల్ ఎంపీడీఓగా ధరావత్ శ్రీనివాసరావు బాధ్యతలను స్వీకరించారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండల ఎంపీడీఓగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు బదిలీపై వచ్చారు. అధికారులు ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తగూడ: కొత్తగూడ ఎంపీడీఓగా రవీంద్రప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా చర్ల మండలనుంచి బదిలీపై వచ్చారు.

నెల్లికుదురు: ఇల్లెందు ఎంపీడీఓగా పనిచేస్తున్న డి.బాలరాజు బదిలీల్లో భాగంగా నెల్లికుదురు ఎంపీడీఓగా బుధవారం బాధ్యతలు చేపట్టారు.

మరిపెడ: మరిపెడ ఎంపీడీఓగా రేవతి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ గుగులోతు అరుణ, ఎంపీటీసీలు, ఎంపీడీఓ కార్యాలయ సూపరిండెంట్ శేషశయనం, ఎంపీఓ పూర్ణచందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

కేసముద్రం: మండల ఎంపీడీఓగా సుభాసిని బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం నుంచి బదిలీపై వచ్చారు.

గూడూరు: మండల ఎంపీడీఓ ఈ.వీరస్వామి బాధ్యతలు స్వీకరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా అలేరు మండలం నుంచి బదిలీపై వచ్చారు.

చిన్నగూడూరు: చిన్నగూడూరు ఎంపీడీఓగా రామారావు బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరిన ఎంపీడీఓను మండల పరిషత్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పెద్దవంగర: పెద్దవంగర ఎంపీడీఓగా వేణుమాధవ్ బాధ్యతలు చేపట్టారు. నూతన ఎంపీడీఓకు మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

వేడుకలను విజయవంతం చేయాలి



మహబూబాబాద్ రూరల్: వేడుకల్లో పాల్గొన్న శంకర్‌నాయక్, తదితరులు

మహబూబాబాద్ రూరల్: సేవాలాల్ మహారాజ్ గిరిజనుల లంబాడి బిడ్డల ఆరాధ్య దైవమని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం సేవాలాల్ గుడి ప్రాంగణంలో బుధవారం భోగ్ బండారో పూజలు చేసి శంకర్ నాయక్ మాట్లాడారు. నేడు జరుగనున్న సేవాలాల్ జయంతి వేడుకల్లో అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సీతామహాలక్ష్మి, సాధు సంతులు, బీఆర్ఎస్ నాయకులు అశోక్, దాము, కిషన్, రామచందర్, నవీన్ పాల్గొన్నారు.

తొర్రూరు: సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మాలోతు సురేష్‌బాబు పిలుపునిచ్చారు.

మరిపెడ రూరల్: సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను నేడు ఘనంగా నిర్వహించుకోవాలని సేవాలాల్ కమిటీ సభ్యుడు విజయ్ కోరారు.

విద్యుత్ అధికారులకు సహకరించాలి



ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న ఏడీ చలపతిరావు

పెద్దవంగర: గృహజ్యోతి పథకానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన డేటా ఆధారంగా అర్హులను నిర్ధారించే ప్రక్రియ చేపడుతున్నామని తొర్రూరు సబ్‌డివిజన్ విద్యుత్‌శాఖ ఏడీ సీఎస్ చలపతిరావు తెలిపారు. బుధవారం మండలంలోని బొమ్మకల్లు గ్రామంలో ఆన్‌లైన్ రీడింగ్ మిషన్లలో అప్‌లోడ్ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగం, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు నంబర్లను సేకరించి ఆన్‌లైన్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. లబ్ధిదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు. దూర ప్రాంతాల్లో ఉన్నవారు రేషన్, ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్లను ఓ చీటీపై రాసి అందజేస్తే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో ఏఈ రమేష్‌బాబు, సబ్‌ఇంజనీర్ మెట్రామ్, లైన్‌మెన్ బోజాలు, జేఎల్ఎం పవన్‌కళ్యాణ్, వీరన్న, చిన్నసాని పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు అండగా సీపీఐ



మాట్లాడుతున్న పద్మ

కురవి: ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలు వారికి దక్కే వరకు సీపీఐ అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్యపద్మ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రం శివారులో పేదలు వేసుకున్న గుడిసెలను ఆమె సందర్శించి గుడిసెవాసులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పది ఏళ్లుగా ఇళ్లస్థలాలు, ఇళ్లు ఇవ్వకుండా మాటలగారడీతో పేదలను గత ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ఈనెల 16న జరిగే సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సహాయ కార్యదర్శి నల్లుసుధాకర్‌రెడ్డి, మండల కార్యదర్శి కరణం రాజన్న, జిల్లా కార్యవర్గ సభ్యుడు నెల్లూరి నాగేశ్వర్‌రావు, నాయకులు బుర్రసమ్మయ్య, కన్నె వెంకన్న, దూదికట్లసారయ్య, అప్పాల వెంకన్న, కృష్ణ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం..

నెహ్రూసెంటర్: ఈనెల 16వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష రాజకీయ పార్టీల నేతలు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఘనపురపు అంజయ్య, సాదుల శ్రీనివాస్, వెంకన్న, పెరుగు కుమార్, చంద్రన్న, రాజ్‌కుమార్, ఐలయ్య, దేవేందర్, నవీన్ పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: ఈనెల 16న జరుగనున్న గ్రామీణ భారత్ బంద్, సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జు దేవేందర్ కోరారు. పిలుపునిచ్చారు. మండలంలోని కంబాలపల్లి, లక్ష్మీపురం (బి) గ్రామాల్లో ట్రాక్టర్లతో ర్యాలీ, ప్రచారం నిర్వహించి వెంకన్న మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్కే బాబన్న, జిల్లా నాయకులు లింగంపల్లి లింగన్న, బాలు, దుర్గేష్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మోదీ అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ తొర్రూరు డివిజన్ అధ్యక్షుడు ఊడుగుల లింగన్న కోరారు. మండలంలోని తూర్పుతండా గ్రామపంచాయతీలోని రేక్యతండాలలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చిర్ర యాకయ్య, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సు

కేసముద్రం: మండలంలోని అమీనాపురం, కల్వల గ్రామాల్లో జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వరంగల్‌కి చెందిన విద్యార్థులు బుధవారం గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు గ్రామంలో గల ప్రభుత్వ కార్యాలయాలు, ఆలయాలు, పంటభూములు, గృహాలు, రహదారులను చిత్రాల రూపంలో ఏర్పాటు చేసి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఆరిద్రపు శ్రీనివాస్, యాకుబ్‌రెడ్డి, రమేష్, సుధాకర్, రవి, సుధాకర్, ఏఈఓ లావణ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కలెక్టర్‌కు వినతి

గార్ల: గార్ల సీహెచ్‌సీలో డాక్టర్లు, స్టాఫ్‌నర్సుల డిప్యూటేషన్‌ను వెంటనే రద్దు చేసి, తిరిగి డాక్టర్లు, స్టాఫ్ నర్సులను తిరిగి గార్ల సీహెచ్‌సీకి పంపించాలని బుధవారం మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాడు.

విగ్రహాల ప్రతిష్ఠ

బయ్యారం: మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో పునఃప్రతిష్ఠ చేపట్టిన రామాలయంలో సీతారాముల విగ్రహాలు, ధ్వజస్తంభం బుధవారం ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గ్రామదేవతల ఆశీస్సులతోనే ప్రజలు సుభిక్షం

పెద్దవంగర: గ్రామ దేవతల ఆశీస్సులతోనే ప్రజలు సుభిక్షంగా ఉంటున్నారని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని అవుతాపురం గ్రామంలో దుర్గమాత వేడుకను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆమె పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

గడ్డివామి దగ్ధం

కేసముద్రం: ఇనుగుర్తి మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డివామి దగ్ధమైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుగులోతు నాగయ్య అనే రైతుకు చెందిన మూడెకరాల గడ్డివామికి, నిప్పంటుకోవడంతో మంటలు వ్యాపించాయి. దీంతో గమనించిన చుట్టుపక్కల రైతులు మోటారు సాయంతో మంటలను చల్లార్చారు. అప్పటికే రెండెకరాల గడ్డి దగ్ధమైనట్లు భాదిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

తల్లిదండ్రులను గౌరవించుకోవాలి

తొర్రూరు రూరల్: తల్లిదండ్రులను ప్రతి వ్యక్తి గౌరవించుకోవాలని సిద్ధార్థ స్కూల్ కరస్పాండెంట్ ముత్తినేని జయప్రకాష్ అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని సిద్ధార్థ స్కూల్‌లో వసంత పంచమి సరస్వతి మాత జన్మదినాన్ని పురస్కరించుకొని పాదపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సమ్మెకు మద్దతు ఇవ్వాలి

కురవి: ఈనెల 16న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మికులు మద్దతు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులను కలిసి మద్దతు అడిగారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, కోటయ్య, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయం ప్రారంభం

గార్ల: మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి దేవాలయంను వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు పరుచూరి నెహ్రూ తిలక్, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, నాదేళ్ల కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సుష్మాస్వరాజ్‌కు నివాళి

తొర్రూరు: డివిజన్ కేంద్రంలో బుధవారం సుష్మాస్వరాజ్ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు రవిబాబు, పులేందర్, యాకయ్య, రాజేష్ పాల్గొన్నారు.

నల్లబెల్లం స్వాధీనం

డోర్నకల్: సీరోలు మండల పరిధిలోని అందనాలపాడు శివారు శీతల తండా సమీపంలోని వ్యవసాయ భూమిలో నిల్వ చేసిన నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డోర్నకల్ ఎస్సై సంతోష్‌రావు బుధవారం తెలిపాడు. శీతలతండా సమీపంలో వ్యవసాయ భూమిలో అక్రమంగా నిల్వ చేసిన 10క్వింటాళ్ల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకుని బానోత్ ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

చింతపల్లిలో చోరీ

కురవి: సీరోలు మండంలో చింతపల్లి గ్రామంలో ఓ ఇంటి వద్ద రిపేరు కోసం రైతులు ఇచ్చిన విద్యుత్ మోటార్లను ఎత్తుకెళ్లినట్లు ఎస్సై విజయ్‌రాంకుమార్ బుధవారం తెలిపాడు. బాధితుడు పెద్దోజు శ్రీనివాస్‌చారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

రేషన్ బియ్యం సీజ్

నెల్లికుదురు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకుని సీజ్ చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ తెలిపాడు. బుధవారం ఎస్సై మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా నీరదొడ్డి మండలం లక్ష్మనగర్ గ్రామానికి చెందిన గుండవేణి బాలయ్య కేసముద్రం మండల కేంద్రం నుంచి బొలెరో వాహనంలో 70బస్తాలు 28 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తూ మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డు వద్ద పట్టుబడినట్లు తెలిపాడు. రేషన్‌బియ్యం ఉన్న వాహనాన్ని సీజ్ చేసి బాలయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గూడూరు: మండలంలోని నాయకపల్లి శివారు కేసముద్రం రహదారిలో బుధవారం రాత్రి జరిగిన జీపు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రగాయాలై, ఒకరి పరిస్థితి విషమంగా మారిన సంఘటన జరిగింది. విలేజ్ కేసముద్రానికి చెందిన మహమ్మద్ అఫ్జల్, యాకూపాష అనే ఇద్దరు ద్విచక్రవాహనంపై కేసముద్రం వెళ్తున్నారు. నాయకపల్లి శివారులో ఎదురుగా వస్తున్న జీపు ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు కిందపడ్డారు. ఒకరికి కాళ్లు విరగ్గా, మరొకరి తలకు తీవ్రగాయమై విషమ పరిస్థితిలోకి చేరుకున్నాడు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అర్హులకే అందేలా చూస్తాం..

డోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను అర్హులకే అందేలా చూస్తామని తహసీల్‌దారు బంజర కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వడ్డెం వెంకటేశ్వర్లు తెలిపాడు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు బొల్లం ఐలయ్య, గోపయ్య, సుదర్శన్‌రెడ్డి, రామారావు పాల్గొన్నారు.


పరామర్శ

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో ధరణి కమిటీ సభ్యుడు మేక సునీల్‌రెడ్డి(భూమి) రెడ్డి తండ్రి మేక సంజీవరెడ్డి మృతి చెందగా రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షురాలు పశ్యపద్మ బుధవారం సునీల్‌రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి, జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బయ్యారం: మండల పాస్టర్స్ నూతన కమిటీని జాన్ శామ్యేల్, జీవ ప్రకాశ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పండు, ఉపాధ్యక్షుడిగా సత్యం, ప్రధాన కార్యదర్శి హత్తిరాం, సహాయ కార్యదర్శిగా సోలోమోన్, డేవిడ్‌రాజ్, కోశాధికారిగా యేసురత్నం, గౌరవ అధ్యక్షులుగా తిమోతి, దేవదాస్, సలహాదారులుగా ఆనంద్‌కుమార్, రవిబాబులను ఎన్నుకున్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



కురవి: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని కురవి ఎస్సై బి.గోపి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కురవి క్రికెట్ కింగ్స్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించాడు. క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కురవి పోలీస్ టీం–తిర్మలాపురం జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. 10 ఓవర్లలో 71 పరుగులను కురవి పోలీస్ టీం చేయగా తిర్మలాపురం జట్టు 71పరుగులు చేయడంతో టై అయింది. సూపర్ ఓవర్‌లో కురవి పోలీస్‌టీం జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్, నాయకుడు నద్దునూరి మహేష్, నిర్వాహకులు సంగెం భరత్, బండారి మహేష్, గుగులోత్ నవీన్, ఉల్లెందుల మహేష్ పాల్గొన్నారు.